చదువుతున్న పుస్తకంలోంచి తలెత్తి ఫోనందుకుందామె.

"హలో!" అందామె.

" ..... ..... "

"ఉంది! పిలుస్తాను. ఒక్క నిమిషం" అని తానే స్వయంగా మనస్విని గదికి నడిచింది. అప్పుడు మనస్విని తన గదిలో కూర్చుని కిటికీ లోంచి నీలాకాశాన్ని చూస్తోంది.

"మనస్వినీ- నీకు ఫోనొచ్చింది ..... ఎవరో మాధవట" అందామె.

"మాధవా? ఆ పేరున్నవాళ్ళెవరూ తనకే తెలియదే' అనుకుందామె.

"త్వరగా రామ్మా" అనేసి వెళ్ళిపోయింది మేడం.

తలుపు దగ్గరగా జారవేసి ఆమె వెనకే నడిచింది మనస్విని. మేడం గదికి చేరుకుని టేబిల్‌మీద పెట్టి వున్న రిసీవర్ అందుకుని -- "హలో! మనస్వినిని మాట్లాడుతున్నాను."

"మనస్వినిగారా! నేను అపోలో హాస్పిటల్ నర్స్‌ని. నా పేరు మాధవి. గాబరాపడకుండా వినండి. మహదేవ్‌గారికి చిన్న ఏక్సిడెంటయితే ఇక్కడ ఎడ్మిటయ్యారు. మహదేవ్, అభిరాంగార్లు మీ మేడంకి తాము మీతో ఫోన్‌లో మాట్లాడినట్లు తెలియడం ఇష్టంలేక నాతో చేయించారు. మీరిప్పుడు రాగలరా?"

"వస్తాను" కంగారుగా అందామె.

"ఆందోళన అవసరంలేదు. మహదేవ్‌గారికి ఏమీ కాలేదు."

"అలాగే!" అట్నుంచి రిసీవర్ పెట్టేసిన చప్పుడు విని, తనూ క్రెడిల్ చేసింది రిసీవర్ని.

"ఏమయింది మనస్వినీ?" అడిగింది ప్రమీలాదేవి.

"మా ఫ్రెండ్ ఒకరు ఏక్సిడెంట్‌కి గురై అపోలో ఆస్పత్రిలో వున్నారట ..... "

"అయ్యయ్యో!"

"నేను చూసి వస్తానండి."

"తప్పకుండా! నీతోపాటు ఎవరినయినా తీసుకెళ్ళు అవసరమైతే."

"ఫర్వాలేదు ఒక్కతినే వెళ్ళొస్తానండి."

"అలాగే" తిరిగి పుస్తకపఠనంలో మునిగిపోయింది ప్రమీలాదేవి మనస్విని గబగబా గదికెళ్ళి తాళంవేసి చీరయినా మరొకటి కట్టుకోకుండా సాదాగా వున్న ఆ చీరతోనే బయలుదేరింది.

రోడ్డు మీదకి నడిచి కన్పించిన ఆటో ఎక్కి "అపోలో!" అంది. మరుక్షణం ఆటో అపోలో హాస్పిటల్‌వైపు దూసుకుపోసాగింది.

'ఎలా జరిగింది ఏక్సిడెంట్? అసలెప్పుడు జరిగింది? అతను ఊరు వెళుతున్నప్పుడా? వెళ్ళి వస్తున్నప్పుడా' శతవిధాలా ఆలోచిస్తోంది.

ఆమె ఆలోచనల వేగంతో సమానంగా పరిగెడుతూ అపోలో ముందాగింది ఆటో.

"చాలీస్ రూపయా" ఆమె ఆదుర్దానీ, అవసరాన్నీ గుర్తించి రెట్టింపు చెప్పాడతను.

అప్పుడు గుర్తొచ్చిందామెకి కంగారులో తాను పర్సు లేకపోటం. ఏం చేయాలో తోచలేదు. ఇంతలో --

"రామ్మా మనస్విని" అంటూ అభిరాం ఆమె దగ్గరికి వచ్చాడు.

"చాలీస్ రూపయా ..... " మళ్ళీ అన్నాడు ఆటోవాలా.

మౌనంగా పర్సులోంచి నలభై రూపాయలు తీసిచ్చి, అతన్ని పంపేశాడు అభిరాం.

"అసలెలా జరిగింది? ఎప్పుడు ..... ఎక్కడ జరిగింది?" ఏడుపొక్కటే తక్కువ! వణుకుతున్న కంఠంతో అడిగిందామె.

"అన్నీ మాట్లాడుకుందాం. పెద్ద ఏక్సిడెంటేమీ కాదు. బెంబేలు పడకు ..... రా" తీసుకెళ్ళాడు.

ఆందోళనగా అతన్ని అనుసరించిందామె.

అభిరాం మహదేవ్ గది ముందుకెళ్ళి తలుపు తీశాడు. తలకి బాండేజ్‌తో, నీరసంగా శుష్కించిపోయిన మహదేవ్ కనిపించాడామెకి బెడ్‌మీద.

జలజలా ఆమె కళ్ళు కృష్ణా, గోదావరులై ప్రవహిస్తుండగా అతన్ని చేరుకుంది.

"ఎలా జరిగింది? ఎప్పుడు జరిగింది?" దాదాపు ఏడుస్తూ అడిగింది. అభిరాం కానీ, అక్కడే కూర్చున్న వరప్రసాదంకానీ ఆ క్షణం గుర్తులేరామెకి.

"పూర్ మనస్విని' ఎందుకా దుఃఖం? నాకేమీ కాలేదు" అనునయిస్తూ అన్నాడు మహదేవ్.

"తలకింత పెద్ద బేండేజ్ చుట్టివుంటే ఏం కాలేదంటావేమిటి?" అని అన్నదామె.

"చిన్న దెబ్బే! కాటన్ ఎక్కువ మిగిలిపోయిందని ఉన్నదంతా నా తలకే చుట్టేశారు" ఆమెని తేలికపరచటానికి నవ్వుతూ అన్నాడతను.

వరప్రసాదం, అభిరాం అతని జోక్‌కి నవ్వేశారు.

"ఎప్పుడు జరిగింది?" కొంచెం మనసు కుదుటపడినాక అడిగింది మనస్విని.

"మా అమ్మకి మన విషయం చెబుదామని బయలుదేరి వెళుతున్న రోజే! ఆటోలో రైల్వేస్టేషన్‌కి వెళుతుండగా."

"నువ్వెక్కిన ఆటో దేనికయినా ఢీకొందా?"

"అదే ఆశ్చర్యం ..... ఆటో దేన్నీ ఢీకొట్టలేదూ, ఆటోని మరే వాహనమూ ఢీకొట్టలేదు! ఏం జరిగిందో తెలియకుండానే ఆటో గాలిలోకి లేచి పల్టీలుకొట్టి నేలమీద పడిపోయింది ..... "

ఆ మాటలు డాక్టర్ చెప్పగా వినటమే అభిరాం, వరప్రసాదంలు. మళ్ళీ ఇప్పుడు మహదేవ్ చెబితే విన్నారు. వాళ్ళుకై వాళ్ళు అడగలేదు. ఆ సంఘటన కదిపితే అతని తలలో అలజడి మొదలవుతుందేమో, దానివల్ల అతనికి జ్ఞాపకశక్తి పోతుందేమో అన్న భయం వాళ్ళిద్దరిలో వుంది.

లారీడ్రైవరే గుద్దేసి, ఏమీ ఎరగనట్టు హాస్పటల్‌లో చేర్చుంటాడని భావిస్తున్న అభిరాం,

అసలు నిజం తెలియటంతో డాక్టర్ నుంచి ఆ లారీ నెంబర్, ఆ డ్రైవర్ లైసన్స్ నెంబర్ అడిగి తీసుకోవాలన్న ఆలోచనకి స్వస్తి పలికాడు.

"ఆటో డ్రైవర్ పరిస్థితెలా వుంది?" అడిగిందామె.

"బ్యాడ్‌లక్ పోయాడు."

దాంతో గుండె జల్లుమందామెకి. "ఎంత ప్రమాదంనుంచి బయట పడ్డావ్?" అంది మనస్విని.

"ఇక ప్రమాదమేం లేనట్టే. మరో రెండు రోజుల్లో మహదేవ్‌గారు ఇంటికెళ్ళిపోవచ్చని డాక్టర్లు చెప్పారు" ఆమెని ఊరడిస్తూ అన్నాడు వరప్రసాదం.

అప్పుడు గమనించిందామె అతన్ని-- ప్రశ్నార్థకంగా చూసింది మహదేవ్ వంక.

"అభిరాం వాళ్ళ అమ్మమ్మగారి వూరే! వీరూ, అభిరాం లేకపోతే నేనేమయిపోయేవాడినో" కృతజ్ఞతగా వరప్రసాదం, అభిరాంల వైపు చూసి అన్నాడు మహదేవ్.

"అంత దూరంచేసి మాట్టాడకురా బాబు. ఎంత మరీ దగ్గర మనుషులు వచ్చినా?" హాస్యమాడాడు అభిరాం.

మనస్విని వరప్రసాదానికి నమస్కరించింది. అతను దీవిస్తున్నట్టు చెయ్యెత్తాడు.

"మరి వెంటనే నాకెందుకు కబురు చేయలేదు?" మహదేవ్ వంక తిరిగి అడిగింది నిష్టూరంగా.

"చిన్నదానికి అనవసరంగా నిన్నెందుకు ఖంగారుపెట్టడమని?" అభిరాం అన్నాడు.

ఆమె మౌనం వహించింది.

మహదేవ్ ఊరెళ్ళిన రోజే తన మనస్సు చెప్పలేని బాధతో గింగిరాలు తిరగడం గుర్తుకొచ్చిందామెకి.

"ఏమిటి? సరదాగా మాట్లాడతావని నిన్ను పిలిపిస్తే రబ్బరుబొమ్మలా మాట్లాడవ్?" అన్నాడు మహదేవ్.

వరప్రసాదం లేచి నిలబడ్డాడు.

"కూర్చుని కూర్చుని కాళ్ళు లాగుతున్నాయ్. అలా తిరిగి వస్తాను" అన్నాడు.

అభిరాం కూడా "మీరు మాట్లాడకుంటూ వుండండి. ఇప్పుడే వస్తాను" అంటూ బయటికి నడిచాడు.

"తలకి గాయం బాగా తగిలిందా?" ఆమె కంఠంలో ఆందోళనకి, దు:ఖానికి కదిలిపోయాడతను. ఆమెవంకే చూస్తూ వుండిపోయాడు.

"నేనడిగిన దానికి సమాధానం చెప్పవేం?"

"లేదు మనస్విని."

"మరంత పెద్ద బేండేజ్ వుంది?"

"చెప్పనా?"

"ఏమిటి జోకా?" చిరుకోపంగా అందామె.

"అబ్బబ్బబ్బా ..... ఈ ఆడాళ్ళతో ఏదొచ్చినా తంటానే" విసుక్కుంటున్నట్లన్నాడతను.

"నువ్వు వూరికి బయలుదేరిన రోజే నా మనస్సు ఏదో తెలియనిబాధకీ, ఉద్వేగానికీ గురయింది. బహుశా యిందుకేనేమో ..... ! దాన్నే ఈ ఎస్పీ అంటారు."

"అంటే?" తెలియనట్లు అడిగాడతను.

"జరగబోయేవి కానీ, జరిగినవి కానీ దూరంనుంచి తెలియడం" అన్నది మనస్విని.

"అభిరాంగాడు చెప్పాడా?" వెటకారంగా అన్నాడు.

"నాకెవరూ చెప్పలేదు. నువ్వు మీ అమ్మ దగ్గరికి వెళతానన్న రోజే నా మనస్సు ఇదీ అని చెప్పలేని విషయంలో ఆందోళనపడింది. పాపంమా హాస్టల్ వార్డెన్ మేడం ప్రమీలాదేవిగారు నన్ను తమ మాటలతో ఉత్తేజపరుస్తూ, నా బాధని పోవాలని ఆ రోజంతా నాతో మాట్లాడుతూ వుండిపోయారు. మళ్ళీ ఈ రోజుదాకా ఏ బాధ లేదు" అందామె.

"కో - ఇన్సిడెంట్ అంతే! నీకూ అభిరాంగాడి జబ్బే వున్నదన్న మాట" వస్తున్న నవ్వుని ఆపుకుంటూ అన్నాడు మహదేవ్.

" అభిరాంకి కూడా ఇలానే అన్పించిందా?" ఎంతో ఆశ్చర్యంగా అంది మనస్విని.

"అలాగే ఏం అన్పించలేదు గానీ ఎప్పుడూ దెయ్యాలూ, భూతాలంటూ వుంటాడు. మానవాతీత శక్తులున్నాయనీ, మంత్రాలు, తంత్రాలున్నాయనీ బుర్ర తినేస్తాడు" అన్నాడు మహదేవ్.

"అంటే నీ ఉద్దేశ్యంలో అవి లేవనా?"

"ఖచ్చితంగా!"

"పొరపడుతున్నావ్."

"నో!" స్థిరంగా అన్నాడతను.

"సర్లే ..... ఆ విషయం గురించి మన మధ్య చర్చలెందుకు?" అందామె.

"ఇంకో రెండు రోజుల్లో డిశ్చార్జి చేస్తామన్నారు డాక్టర్లు" అన్నాడు మహదేవ్.

"అయితే నేను ఆఫీస్‌కి లీవ్ పెట్టేస్తాను."

"ఎందుకు? ఏకంగా రిజైన్ చేసెయ్!"

"ఎందుకు?" అంది మనస్విని.

"ఇంకెందుకు? ఇలా అమ్మకి చెప్పడం - అలా మన పెళ్ళి జరిగిపోవటమే ..... నాకు తగ్గిన వెంటనే గుంటూరు వెళ్ళి అట్నుంచి గ్రీన్ సిగ్నల్‌తో వచ్చేస్తాను. మీవాళ్ళ విషయం ఏమిటి?" అన్నాడతను.

"మా వాళ్ళు అవునన్నా, కాదన్నా నా నిర్ణయం ఒకటే. ఒకసారి నేనొక నిర్ణయానికి వస్తే ఇంకంతే ..... దాన్నెవరూ మార్చలేరు" స్థిరంగా అందామె.

"దట్స్ గుడ్!" అన్నాడతను.

ఎనిమిదిన్నర వరకూ మహదేవ్‌తో అలా ఏదో విషయం మాట్లాడుతూనే వుండిపోయింది. ఒకరి సాంగత్యాన్నొకరు వీడలేనట్టు యుగాల కలయిక తర్వాత కలసినట్టు అతన్ని వీడి ఆమె వెళ్ళలేకపోతుంది.

కానీ మరీ లేటయితే బావుండదని .....

"ఇక వెళతాను. రేపుదయం వస్తాను. సాయంత్రం ఈ టైందాకా వుంటాను" అందామె.

భారంగా ఆమెకి వీడ్కోలిచ్చాడు మహదేవ్. బయట కూర్చున్న అభిరాం, వరప్రసాదం ఆమెని చూసి సోఫాలోంచి లేచి నిలబడ్డారు.

"మాట్లాడావా? మహదేవ్ ఏమంటున్నాడు?" ఆత్రుతగా అడిగాడు అభిరాం.

ఆమె చిన్నగా నవ్వేసింది.

"అదీ ..... అలా వుండాలి. పద నిన్ను దింపి వస్తాను" అంటూ వరప్రసాదంకేసి చూశాడు వెళతామన్నట్టు.

"వెళ్ళొస్తానండి" రెండు చేతులు జోడించి వరప్రసాదంతో అంది ఆమె.

"మంచిదమ్మా!" అన్నాడతను.

అభిరాంతో పాటు బయటికి నడిచిందామె. వరప్రసాదం మహదేవ్ గదికి వెళ్ళాడు.

* * * * *

మెల్లమెల్లగా సంధ్యాకాంతులు చీకటిగర్భంలోకి ముకులించుకుపోతున్నాయి. పక్షులన్నీ హడావుడిగా గూళ్ళకి చేరిపోతున్నాయి. సైనిక్ పురీ కాలనీలోని ఫ్లాట్స్ అన్నింట్లో విద్యుద్దీపాలు వెలుగుతున్నాయి.

కేవలం ఆ కాలనీ మొత్తంమీద ఒకింటిలోనే లైట్స్ లేకుండా నిశీధి ఒడిలో నిద్రపోతోంది.

ఫ్లాట్ నెంబర్ నలభై ఒకటిలో వుంటున్న దంపతులు సినిమాకి వెళ్ళారు.

అప్పుడా సమయంలో ఇంటిలో వున్నది ఒక్కరే! అతని పేరు వెంకట్రావ్. ఆ ఇంటి యజమాని తండ్రి. ఏదో పల్లెటూరు ఆయనది. కొడుకుని చూడటానికి ఆ రోజే వచ్చాడతను.

ఇంటిలో ఏం తోచక బయటికి నడవబోయాడు-

"కుయ్ ..... కుయ్" మంటూ మూలిగింది గొలుసుతో కట్టివేయబడిన కుక్క డాలీ.

ఉదయం వచ్చిన దగ్గర నుంచి అతనితో దానికి బాగా దోస్తీకుదిరిపోయింది.

"పాపం రోజంతా కట్టే వుంది. అలా బయటికి తీసుకెళదాం" అనుకుని పోర్టికోలోకి నడిచాడతను డాలీ గొలుసు విప్పి చేత్తో పట్టుకుని.

హాల్లోంచి బయటికి వచ్చినంత వరకూ బాగానే వుంది. సరిగ్గా పోర్టికోలోకి రాగానే తమ పక్కింటి వైపు చూసి "భౌభౌ ..... భౌభౌ ..... " మంటూ గొంతు చిరిగిపోయేలా మొరగసాగింది. కుక్క అరుపులకి అతనూ దానితోపాటే అటు చూశాడు.